ప్రజాశక్తి

సోమవారం 18 నవంబర్ 2024 5

శ్రీ సత్యసాయి

కరాటేలో 'పురం' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - హిందూపురం

4వ ఓపెన్ ఇన్విటేషల్ నేషనల్ లెవెల్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో పురం విద్యార్థులు ప్రతిభ చాటినట్లు కరాటే మాస్టర్ ఫైరోజ్ తెలిపారు. ఆదివారం కర్నాటక రాష్ట్రం చిక్కబళాపురంలో జరిగిన 4వ ఓపెన్ ఇన్విటేషల్ నేషనల్ లెవెల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో తమ వద్ద శిక్షణ పొందిన పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు 12 మంది వివిధ క్యాటగిరిలో పాల్గొన్నారన్నారు. ఇందులో 11 మంది ప్రథమ స్థానంలో, ఐదుగురు వివిధ విభాగాల్లో ద్వితీయ స్థానంలో, ఇద్దరు తృతీయ స్థానం సాధించారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రముఖులు మెమెంటో, సర్టిఫికెట్లను అందించి అభినందించారని తెలిపారు. అదే విధంగా హైదరాబాద్ లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కరాటే టోర్నమెంట్ లో పురం విద్యార్థులు విజేతగా నిలిచినట్లు కరాటే మాస్టర్ ఫైరోజ్ తెలిపారు. ఆదివారం ముదిరెడ్డిపల్లి లో కరాటే శిక్షణ కేంద్రంలో ప్రతిభ చాటిన 22 మంది కరాటే విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు నరేష్, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

పిఎబిఆర్‌లో కదలికొచ్చేనా ?

◆ సామర్థ్యం మేరకు నీటి నిల్వకు చర్యలుండేనా ..?

◆ మూడు దశాబ్దాలుగా ఎదురుచూపులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలోనున్న అతి పెద్ద రిజర్వాయరు పెన్నహోబిలం రిజర్వాయరు. 11 టిఎంసిల నిలువ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ రిజర్వాయరులో సగానికి కూడా నీటిని నింపుకోలేని పరిస్థితి దశబ్దాలుగా కొనసాగుతోంది. 1994లో ప్రాజెక్టు నిర్మాణం పూర్తయింది. నిర్మాణ సమయంలో స్పిల్‌వే నాణ్యతా లోపాలతో లీకేజీలు ఏర్పడ్డాయి. వీటిని అరికట్టేందుకు ఇప్పటి వరకు రూ.13 కోట్లకుపైగా నిధులను వెచ్చించారు. కాని పెద్దగా ప్రయోజనం చేకూరలేదు. ఇప్పటికీ లీకేజీలు కొనసాగుతూనే ఉన్నాయి. దీన్ని పూర్తి స్థాయిలో అరికట్టాలంటే జియోమెమ్రైన్ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. దీనికి ప్రతిపాదనలు కూడా పలుదఫాలుగా ప్రభుత్వానికి పంపారు. అయితే చర్యలు మాత్రం తీసుకున్న దాఖలాల్లేవు.

పూర్తవని భూసేకరణ

ప్రాజెక్టు నిర్మాణ లోపాలతో పూర్తి సామర్థ్యంతో నీటిని నింపే పరిస్థితి లేకపోవడం ఒకవైపు ఉంటే మరోవైపు భూసేకరణ కూడా ఇప్పటికీ పూర్తవ లేదు.11 టింఎంసిలు నిలువ ఉంచాలంటే ఇంకా 2500 ఎకరాల భూసేకకరణ జరగాల్సి ఉంది. మూడు దశాబ్దాలుగా అనేక ప్రభుత్వాలు మారినా ఇప్పటికీ భూసేకకరణ ప్రక్రియ పూర్తవలేదు. జిల్లా కలెక్టరు వినోద్‌కుమార్ బుధవారం హెచ్ఎల్‌సి కార్యాలయం పరిశీలించి పూర్తి సామర్థ్యంతో నింపాలని చెప్పారు. అలా నింపాలంటే ముందుగా భూసేకరణ పూర్తి చేయాల్సి ఉంటుంది.

పిఎబిఆర్ లింకు కెనాల్ సామర్థ్యం తక్కువ

పిఎబిఆర్‌ను పూర్తి సామర్థ్యంతో నీటితో నింపాలంటే పిఎబిఆర్ లింకు కెనాల్ కెపాసిటీని పెంచాల్సి ఉంటుంది. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా 1800 క్యూసెక్కుల నీరొస్తే పిఎబిఆర్ నిండుతుంది. అయితే్ల లింకు కెనాల్ కు 800 క్యూసెక్కులు మాత్రమే సామర్థ్యం ఉంది. దీని ప్రవాహ సామర్థ్యం పెంచకపోకపోవడంతో డ్యామ్‌కు నీటిని సకాలంలో తీసుకోలేకపోతున్నారు.

ఆయకట్టుకూ ఇక్కట్లు

కెసి కెనాల్ డైవర్షన్ ద్వారా పది టిఎంసిల నీళ్లు జిల్లాకు కేటాయింపులున్నాయి. ఈ నీటిని పిఎబిఆర్ డ్యామ్ ద్వారా కుడి కాలువ, ధర్మవరం కాలువ, పులివెందుల బ్రాంచ్ కెనాల్ కలిపి 50 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరందని పరిస్థితి ఉంది.

ఇప్పటికైనా నిధులివ్వాలి ..

ఇప్పటికైనా ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు కేటాయించాలన్న డిమాండ్ వస్తోంది. సిపిఎం అక్టోబరు 15 నుంచి 21వ తేదీ వరకు బస్సు యాత్ర చేపట్టింది. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసింది. బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సిపిఎం డిమాండ్ చేస్తోంది.

అసంపూర్తిగా గృహ నిర్మాణాలు

జిల్లాలో 72,353 ఇళ్లు మంజూరు

పూర్తయినవి 22,756

ప్రజాశక్తి-హిందూపురం

పార్టీ ఎద్దైనా...పాలకులు ఎవరైనా....ఎన్నికలు ఎప్పుడు వచ్చిన వారు ఇచ్చే హామీలు పోలావరం పూర్తి చేస్తాం...ఇళ్లు లేని వారందరికి పక్కా గృహాలు నిర్మించి ఇస్తాం ...అంటూ చెబుతారు...ఈ రెండు ఇప్పటికే కాదు ఎప్పటికి పూర్తి చేస్తారో ఈ పాలకులకే తెలియదు. ఈ రెండు సమస్యలు ఎన్నికల సమయంలో అన్ని పార్టీలకు వరంలా మారాయి.

జిల్లా వ్యాప్తంగా పేదలందరికీ ఇళ్ల కార్యక్రమం అసంపూర్తిగా నిలిచింది. ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మిస్తామన్న ప్రభుత్వ హామీ ముందుకు సాగడం లేదు. వైసిపి అధికారంలో ఉన్న సమయంలో ఇళ్ల నిర్మాణం కోసం వేసిన పునాదులు అక్కడితోనే ఆగిపోయాయి. 2014-2019 మధ్య కాలంలో టిడిపి ప్రభుత్వం ప్రారంభించిన టిడ్కో గృహాలు కనీస మౌలిక సదుపాయాలు లేక దిష్టిబొమ్మల్లా దర్శనం ఇస్తున్నాయి. పేదలందరికీ ఇళ్ల నిర్మాణం ఎప్పటికి పూర్తయ్యేనో అనే ప్రశ్న అందరినీ తొలుస్తోంది. ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా చెబుతున్న పథకాల్లో గృహ నిర్మాణం ఒకటి. ఇప్పటి వరకూ జిల్లాలో మంజూరైన ఇళ్లు, పూర్తయిన ఇళ్ల నిర్మాణాల లెక్కలు పరిశీలిస్తే ఈ పథకం ఎంత అధ్వాన స్థితిలో ఉందో తెలుస్తుంది. జిల్లాలో 7 నియోజక వర్గాలు ఉండగా వైఎస్ఆర్ జగనన్న కాలనీలు, పిఎంఎవై గృహనిర్మాణాల కింద 72,353 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటి వరకూ పూర్తయిన ఇళ్లు22,353 మాత్రమే. మిగతా 49, 597 ఇళ్ల నిర్మాణాలు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీన్ని బట్టి రెండు జిల్లాలో పేదలందరికీ ఇళ్ల నిర్మాణం పథకం ఏ పరిస్థితిలో ఉందో స్పష్టమవుతోంది. పేదలందరికీ ఇళ్ల నిర్మాణం ముందుకు సాగకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. అనేక చోట్ల ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లస్థలాలు గృహ నిర్మాణాలకు అనుకూలంగా లేని పరిస్థితి నెలకొంది. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన ఇప్పటికీ పూర్తికాకపోవడం అతిముఖ్యమైన కారణంగా లబ్ధిదారులు చెబుతున్నారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే సొమ్ము ఏమాత్రం సరిపోకపోవడం ప్రధాన కారణంగా కన్పిస్తోంది.

రూ. 1. 80 లక్షలతో ఇంటి నిర్మాణం పూర్తవుతుందా..?

కొటిపి లే అవుట్‌లో పునాదులకే పరిమితమైన గృహ నిర్మాణాలు

ఇంటి నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం చేస్తున్న సాయం కేవలం రూ. 1.80 లక్షలు మాత్రమే. ఈ సొమ్ము పునాదుల దశకు కూడా సరిపోని పరిస్థితి నెలకొంది. సిమెంట్, ఐరన్, ఇసుక వంటి ధరలు ఆకాశంలో ఉన్నాయి. గత ప్రభుత్వం పట్టణంలో సెంటు, గ్రామాల్లో ఇచ్చిన సెంటున్నర స్థలంలో ఇల్లు నిర్మించాలంటే తక్కువగా లెక్కించినా దాదాపు రూ.8 లక్షలు వరకూ ఖర్చవుతున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. దీన్నిబట్టి చూస్తే ఇల్లు నిర్మించాలంటే ప్రభుత్వం ఇచ్చే సాయం కాకుండా మరో రూ.6 లక్షలకు పైన అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంత పెద్దమొత్తంలో అప్పు పుట్టే పరిస్థితి ఇళ్ల స్థలాల పొందిన లబ్ధిదారులకు లేదు. దీంతో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. ఇల్లు కట్టకపోతే ఇంటి స్థలం వెనక్కి తీసుకుంటామని లబ్ధిదారులకు నోటీసులు వంటివి జారీ చేసినా ముందుకు రాని పరిస్థితి నెలకొంది. పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందించే సాయం పెంచడం లేదు. దీంతో లబ్ధిదారులు అప్పు చేసి ఇల్లు కట్టేందుకు ససేమిరా అంటున్నారు. ప్రభుత్వం మాత్రం అన్నీ తామే ఇస్తున్నట్లు గొప్పలు చెప్పడం తప్ప క్షేత్రస్థాయిలో మాత్రం పట్టించుకోని పరిస్థితి ఉంది. దీంతో ఆప్షన్ 3 కింద గత ప్రభుత్వం ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని గుత్తేదారులకు పనులు అప్పగించిన, గుత్తేదారులు పూనాదులు వేసి చేతులెత్తాశారు. గృహప్రవేశాలకు సంబంధించి గత ప్రభుత్వం పలుమార్లు తేదీలు ప్రకటించడం వెనక్కి తగ్గడం జరిగింది. ఇప్పటికైనా ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి అందించే సాయం పెంచితే లబ్ధిదారులు ముందుకొచ్చే పరిస్థితి ఉంటుంది.

వచ్చే మార్చిలోగా పూర్తి చేసేందుకు ప్రణాళిక

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం వచ్చే మార్చిలోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్దిదారులకు ఇళ్లను ఇవ్వాలన్న ప్రణాళికలతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నిర్మాణదశలో ఉన్న గృహ నిర్మాణాలు పూర్తికాకపోతే నిధులకు అవరోధం ఏర్పడే అవకాశం ఉంది. దీంతో 'మన ఇల్లు-మన గౌరవం' పేరుతో లబ్దిదారులకు అవగాహన కల్పించాలని ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించింది. గత నెల నుంచి ప్రతి లేఅవుట్లో సమావేశం ఏర్పాటు చేసి లబ్దిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ఉన్న స్థలంలోనే ఇల్లు నిర్మించుకోవాలని, గడువులోగా పూర్తి చేసుకోకుంటే బిల్లులు వచ్చే పరిస్థితి లేదని వివరిస్తున్నారు.

నేటి నుంచి సత్యసాయి జయంతి వేడుకలు

అన్నదానానికి అవసరమైన ఏర్పాట్లు పరిశీలిస్తున్న సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్, తదితరులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సత్యసాయి జయంతి వేడుకలు సోమవారం నుంచి ఈ నెల 23 వరకు జరగనున్నాయి.సోమవారం వేణుగోపాల స్వామి రథోత్సవంతో వేడుకలు ప్రారంభం కానున్నాయి. వేణుగోపాల స్వామి గుడి నుంచి గోపురం గేటు వరకు రథం లాగుతారు. ఈ రథోత్సవానికి దేశ విదేశాల భక్తులతో పాటు పుట్టపర్తి పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనున్నారు. 23 వరకు జరిగే వేడుకలకు ప్రశాంతి నిలయంలో ఉచిత అన్న ప్రసాదములు పంపిణీకి ట్రస్టు అన్ని ఏర్పాట్లు చేపట్టింది. 19న మహిళా దినోత్సవం, 22న సత్యసాయి యూనివర్సిటీ స్నాతకోత్సవం జరుగుతుంది. 23న సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలను హిల్వ్ స్టేడియంలో జరగనున్నాయి. స్నాత్కోత్సవానికి, జయంతి వేడుకలకు ప్రముఖులు పాల్గొనే అవకాశం ఉంది. ఇప్పటికే పలు రాష్ట్రాల నుంచి భక్తులు సేవాదళ్ సభ్యులు ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. జాతీయ సేవాదళ్ సమితి సభ్యులు ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. వేడుకల్లో పాల్గొనే విఐపిలకు తగిన ఏర్పాట్లు చేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద్ వారం రోజుల నుంచి పారిశుధ్యంపై దృష్టి పెట్టి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి చర్యలు చేపట్టారు.ఆర్టీసీ వారు ఈ వేడుకలకు 100 బస్సులు సమకూర్చనున్నారు. ప్రభుత్వం పరంగా చేపడుతున్న పనులను సోమవారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పర్యవేక్షించారు.

జయంతి వేడుకలకు పటిష్ట బందోబస్తు.

పుట్టపర్తి రూరల్: శ్రీ సత్య సాయి బాబా 99జయంతి వేడుకల కు, విఐపి లు, వివిఐపీలు లు రానున్న నేపథ్యంలో, జిల్లా ఎస్పీ వి.రత్న ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీసు భద్రత ఏర్పాట్లను చేపట్టారు. శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ తో కలిసి ఏర్పాట్ల పై పోలీస్ అధికారులతో ఎస్పీ సమీక్షించారు. ఈనెల 18 నుండి 24 వరకు జరుగునున్న శ్రీ సత్య సాయి బాబా జయంతి వేడుకల కు వచ్చే వివిఐపి, వీఐపీలు, దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులు కోసం పోలీస్ శాఖ చేపట్టవలసిన భద్రత ఏర్పాట్లు తదితర విషయాలపై ట్రస్టు వారితో చర్చించారు. 18న రథోత్సవ కార్యక్రమం జరుగుతున్న సందర్భంగా, సత్తెమ్మ గుడి నుండి గోపురం గేటు వరకు సాగే ఈ రథోత్సవ కార్యక్రమానికి ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా డైవర్షన్ చేశారు. కొత్తచెరువు, అనంతపూర్ , ధర్మవరం గోరంట్ల, బెంగళూరు వైపు నుండి వచ్చే వాహనాలన్నీ గణేష్ సర్కిల్ నుండి చిత్రావతి వైపు మళ్లింపులు చేపడుతున్నారు. అదేవిధంగా నల్లమాడ, కదిరి బుక్కపట్నం వైపు నుండి వచ్చే వాహనాలు కూడా చిత్రావతి వైపు నుండి గణేష్ సర్కిల్ మీదగా మళ్లించనున్నారు. 21 నుండి 23 వరకు అనంతపురం ,కొత్తచెరువు, బెంగళూరు గోరంట్ల,వైపు నుంచి వచ్చే వాహనాలన్నీ సూపర్ స్పెషాలిటీ నుండి బ్రాహ్మణపల్లి ఎనుములపల్లి చిత్రావతి వైపు ట్రాఫిక్ ట్రాఫిక్ ను మళ్లించనున్నారు.

కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే విద్యార్థి మృతి

ఎస్ఎఫ్ఐ నాయకులు

పుట్టపర్తి డీఎస్పీ కార్యాలయం ముందు నాయకులు, మృతుని బంధువులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి పట్టణ సమీపంలో గల సంస్కృతి స్కూల్ ఆఫ్ బిజినెస్ కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే విద్యార్థి మృతి చెందాడని ఎస్ఎఫ్ఐ నాయకులు, మృతుని తల్లిదండ్రులు అన్నారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ నాయకుల బాబావలి, పవన్ తదితరులు మృతుని తల్లిదండ్రులు శ్రీనివాసులు, శాంతమ్మతో పాటు ఆదివారం స్థానిక డీఎస్పీని కలిశారు. కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాలేజీ క్యాంపస్ లో గొడవ జరిగినప్పుడు యాజమాన్యం తగిన చర్యలు తీసుకొని ఆ విద్యార్థిని ఆసుపత్రికి తరలించి ఉంటే బతికేవాడని అన్నారు. ఫీజుల వసూలులో ఉన్న శ్రద్ధ విద్యార్థుల బాగోగుల విషయంలో కళాశాల యాజమాన్యం చూపడం లేదని విమర్శించారు. కళాశాల యాజమాన్య వైఖరిపై పుట్టపర్తి డీఎస్పీ ని కలిసి యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. అంతేకాక ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కదిరి, హిందూపురంలో డీఎస్పీలకు వినతి పత్రాలు సమర్పించామన్నారు. అధికారులు కళాశాల యాజమాన్యంపై తగు చర్యలు తీసుకునే వరకు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మృతుని తల్లిదండ్రులు మాట్లాడుతూ, లక్షల రూపాయలు పెట్టి తమ కుమారుని ఈ కాలేజీకి పంపితే ఎదిగిన కొడుకును పోగొట్టుకొని తమకు దుఃఖాన్ని మిగిల్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము యాజమాన్యాన్ని నమ్మి కాలేజీకి పంపామన్నారు. కాలేజీ క్యాంపస్ లోనే గొడవలు జరిగితే యాజమాన్యం పట్టించుకోకపోతే విద్యార్థుల భద్రత ఎంతవరకు ఉంటుందని ప్రశ్నించారు. తమ కొడుకు మృతి పట్ల పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

'కొన్ని చీకట్లూ.. ఓ వెలుతురూ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కవి సమ్మేళనం

అనంతపురం : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సంస్థ కార్యదర్శి రమ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

ఆధునిక జీవిత సంఘర్షణలకు ప్రతిబింబాలే 'ప్రగతి' కథలు

యోగి వేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎం.వినోదిని

'కొన్ని చీకట్లూ.. ఓ వెలుతురూ' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం

ఆధునిక జీవిత సంఘర్షణలకు ప్రతిబింబాలే రచయిత్రి ప్రగతి రచించిన కథలు అని యోగి వేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎం.వినోదిని అన్నారు. ఆదివారం నగరంలోని ఎన్‌జిఒ హోంలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో ప్రగతి రచించిన 'కొన్ని చీకట్లూ.. ఓ వెలుతురూ' అనే కథా సంపుటి పరిచయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వినోదిని మాట్లాడుతూ అమ్మ మనసుతో ప్రగతి కథా సాహిత్య సృజన చేశారన్నారు. ఆధునిక జీవితంలోని సౌందర్యం, సంఘర్షణలను అక్షరబద్ధం చేశారని విశ్లేషించారు. ఎదిగే వయసులో ఆడపిల్లల ఆలోచనలు, అలజడులను సహానుభూతితో అర్థం చేసుకున్నప్పుడే ఆధునికత సాధ్యపడుతుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కవి, విమర్శకులు తూముచర్ల రాజారామ్ మాట్లాడుతూ వ్యక్తిగత స్వేచ్ఛను గుర్తించాల్సిన అవసరాన్ని ఆధునిక సమాజంలో మనుషులు మరింత ఆధునికం కావాల్సిన సందర్భాలను ఈ కథలో వివరిస్తున్నాయన్నారు. కథలపై జరిగిన చర్చకు సమన్వయకర్తలుగా డాక్టర్ అంకె శ్రీనివాస్, డాక్టర్ హెచ్ పల్లవి వ్యవహరించారు. జీవితంలోని సున్నితత్వం, సమాజంలో వెలుగు చూడని కోణాలను మన ముందుకు తీసుకొచ్చారని డాక్టర్ అంకె శ్రీనివాస్ అన్నారు. డాక్టర్ పల్లవి మాట్లాడుతూ సమాజానికి ప్రగతి సద్విమర్శల ద్వారా రచయిత కలం మరింత పదునెక్కుతుందన్నారు. సంపుటిలోని పదహారు కథలపైన రెండు సెషన్లుగా జరిగిన చర్చలో అరుణాకాకి, చంద్రశేఖర శాస్త్రి, చిలుకూరి దీవెన, యమునారాణి, శేషగిరి రాయుడు, శోభామణి, సంగాలు, హేమమాలిని ఒక్కొక్కరు రెండు కథలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. రాయచోటి నుండి విచ్చేసిన డాక్టర్ వెంకటనారాయణ ప్రగతి రాసిన కథలలో శ్రామిక మహిళలు అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు, సామాజిక కార్యకర్తలు యాములపల్లి నర్సిరెడ్డి, రాధేయ, ఉప్పరపాటి వెంకటేశులు, ఎస్ఎం.బాషా, సత్యబోస్, గోవిందరాజులు, జెట్టి జైరామ్, తరిమెల అమర్నాథరెడ్డి, చెన్నా రామ్మూర్తి, జూటూరు తులసీదాస్, హిదయతుల్లా, నాగలింగమయ్య, భానుజ, ప్రజ్ఞా సురేష్, రవిచంద్ర, రాఘవేంద్ర, కొత్తపల్లి సురేష్, రియాజుద్దీన్, డాక్టర్ షరీఫ్, ప్రిన్సిపాల్ జనార్ధన్‌రెడ్డి, శశికళ, సత్యనారాయణరావు, అధ్యాపకులు శివచంద్ర, శైలజారాణి, లక్ష్మీకాంత్, శేషారెడ్డి, శ్యాంకుమార్, పావని, మాధవి, కృష్ణవేణి, రవిశంకర్, రాధిక, బాలరంగయ్య, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా గ్రంథాలయ సేవలు

ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గ్రంథాలయాల సేవలను ప్రజలు, విద్యార్థులకు చేరువ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి,రమ అన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 73 గ్రంథాలయాల ద్వారా ప్రజలకు విజ్ఞానాన్ని అందిస్తున్నామన్నారు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడారు.

ప్రశ్న : డిజిటల్ లైబ్రరీ సేవలు ఎలా ఉన్నాయి?

జవాబు : రాష్ట్రంలోనే ప్రథమంగా అనంతపురం ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు ఏర్పాటు చేసింది. ఎన్నో వేల పుస్తకాలను డిజిటల్ లైబ్రరీల ద్వారా ప్రజలకు సులువుగా సేవలు అందించేందుకు డిజిటల్ లైబ్రరీ ఎంతో ఉపయోగంగా మారింది. డిజిటల్ లైబ్రరీ సేవలు అందించడానికి ఎంతో వ్యయ ఖర్చులు అవసరం. ప్రభుత్వం వీటిని కొనసాగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది.

ప్ర : అన్నింటికీ సొంతభవనాలు ఉన్నాయి?

జ : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 72 గ్రంథాలయాలు ఉండగా 43 సొంత భవనాలు, 9 అద్దె భవనాలు, 18 అద్దె ఉచిత భవనాల్లో ఉన్నాయి. గ్రంథాలయాల సొంత భవనాల నిర్మాణానికి, స్థల సేకరణ, నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం

ప్ర : గ్రంథాలయాల్లో ఎన్ని పుస్తకాలు ఉన్నాయి?

జ : ఉమ్మడి అనంతపురం జిల్లాలో 767605 పుస్తకాలు ఉన్నాయి. అనంతపురం జిల్లా కేంద్రంలోనే 49,447 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఇవేకాక పాఠకుల డిమాండ్‌ను బట్టి పుస్తకాలు కూడా తెప్పిస్తున్నాం. నిరుద్యోగ యువతీ యువకుల అనువైన పోటీ పరీక్షలు సంబంధించి పుస్తకాలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చాం.

ప్ర : లైబ్రరీలో సభ్యత్వం పొందాలంటే ఎలా ? ఎంతమంది ఉన్నారు?

జ : ఉమ్మడి అనంతపురం జిల్లాలో 77,744 మంది సభ్యత్వం పొంది ఉన్నారు. ఒక్క అనంతపురం జిల్లా కేంద్రంలోనే 8,393 మంది సభ్యతం తీసుకున్నారు. రూ.వంద జమ చేస్తే రిజిస్ట్రేషన్ చేసి వారికి రెగ్యులర్‌గా పుస్తకాలు ఇంటికి తీసుకువెళ్లే వెసులుబాటు కల్పిస్తాం. తీసుకెళ్లిన పుస్తకాలు రెండు వారాల్లోపు తిరిగి గ్రంథాలయాలకు అందజేయాల్సి ఉంటుంది.

ప్ర : సిబ్బంది కొరత ఉందా?

జ : ఉమ్మడి అనంతపురం జిల్లాలో 73 మంది రెగ్యులర్ సిబ్బంది, 25 మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. 66 పోస్టులు ఖాళీలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా గ్రంథాలయాలకు 139 ముందు సిబ్బంది ఉండాల్సి ఉంది. ఖాళీలకు సంబంధించి ప్రభుత్వానికి తెలియజేశాం.

ప్ర : గ్రంథాలయాలకు సంబంధించి బకాయిలు ఉన్నాయా?

జ : ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ శాఖల నుంచి రూ.5,92,75,023 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఈ విషయాన్ని కలెక్టర్‌తోపాటు గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ దృష్టికి కూడా తీసుకెళ్లాం. ఇప్పటికే ఆయా శాఖలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. బకాయిలన్నీ సజావుగా అందితే గ్రంథాలయాల నుంచి మరింత విశిష్టమైన సేవలను అందిస్తాం.

ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ

జిల్లా వ్యాప్తంగా పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు ఆదివారం పోలీసులు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా పేకాట స్థావరాలపై దాడులు చేశారు. ఈ క్రమంలో తనకల్లు మండలం లోని వంకంపల్లి శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 4,060 స్వాధీనం చేసుకున్నారు. ధర్మవరంలో నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 6,500, 4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పలు గ్రామాల్లో పోలీసు అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ప్రజలు గొడవలకు దూరంగా ప్రశాంతంగా జీవించాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరిగితే సమాచారం ఇవ్వాలని కోరారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎక్కడైనా ఎలాంటి సమస్యలు సృష్టించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పలుచోట్ల పోలీసులు రోడ్లపైకి వచ్చి విజిబుల్ పోలీస్ సింగ్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగవద్దన్నారు. పెట్రోలింగ్ ముమ్మరం చేస్తూ అనుమానిత వ్యక్తులపై ఆరా తీశారు. రైలు, బస్‌స్టేషన్ల లో కొత్త వ్యక్తుల వివరాలు ఆరా తీసి అనుమానిత వ్యక్తులను ప్రశ్నించారు. ఏటిఎంల వద్ద చోరీలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టారు. ఎక్కడా ఎలాంటి నేరం జరగకుండా పోలీసులు గస్తీ తిరిగారు.

గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

'సంస్కృతి' యాజమాన్యంపై డీఎస్పీకి ఫిర్యాదు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పట్టణంలోని సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థి మృతికి కారణాలను వెలికితీయడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, నామాల నాగార్జున డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం వారు మాట్లాడుతూ సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ప్రేమ్‌సాయిపై తోటి విద్యార్థులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడన్నారు. అయితే ఆ కళాశాల యాజమాన్యం కనీసం హాస్పిటల్‌కి తీసుకెళ్లక పోగా విద్యార్థి తల్లిదండ్రులకు కూడా సమాచారం ఇవ్వలేదన్నారు. గాయపడిన విద్యార్థి స్నేహితుల సాయంతో హిందూపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడన్నారు. పరిస్థితి విషమించడంతో తల్లిదండ్రులు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే విద్యార్థి మృతి చెందడం బాధాకరమన్నారు. విద్యార్థి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి డ్రగ్స్, ర్యాగింగ్, తదితర అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

కదిరిలో డీఎస్పీ శివనారాయణ స్వామికి వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కదిరి టౌన్ : విద్యార్థి మృతికి కారణమైన సంస్కృతి కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబ్‌జాన్ ఆధ్వర్యంలో డీఎస్పీ శివనారాయణ స్వామికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు విజయ్‌కుమార్, నాయకులు అఖిల్, భానుప్రసాద్, అభిరామ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

స్వాతంత్ర్య పోరాటం జరుగుతున్న కాలంలో ప్రజలను చైతన్య పరచడానికి గ్రంథాలయ ఉద్యమం జరిగిందని శ్రీజ్యోతి హైస్కూల్ ఉపాధ్యాయులు కాటమయ్య, మహమ్మద్‌రఫి తెలిపారు. స్థానిక శ్రీజ్యోతి హైస్కూల్ ఆదివారం శాఖా గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరి అధ్యక్షతన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, పాతూరు నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ప్రజలను విజ్ఞానవంతులు, చైతన్యవంతులను చేయడంలో గ్రంథాలయాలు ముఖ్యభూమిక పోషిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలకు వెళ్లి విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రొద్దం : స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయులు గంగాధర్ కవులు పోతన, నన్నయ, తిక్కన, ఎర్రాప్రగడ, తెనాలి రామకృష్ణుడు, వంటి వారు రచించిన కవిత్వం గురించి ఉపాధ్యాయులు, విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపధ్యాయులు షెక్షావలి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రొద్దంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్న అధికారి

గాండ్లపెంట : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారిణి పర్విన్‌బాను తెలిపారు ఆమె మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాల్లోని పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవచ్చు అన్నారు. పోటీల విజేతలకు ఈ నెల 20వ తేదీ స్థానిక జడ్పీ హైస్కూల్‌లో బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కె.మహేష్‌బాబు, ఉపాధ్యాయుడు కె.మల్లికార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల భవనంపై పెరిగిన మొక్క

'మొక్క దశలోనే తుంచేస్తే సరి'

తలుపుల : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనంపై ఓ చిన్న మొక్క క్రమంగా పెరుగుతోంది. ఈ మొక్క చెట్టుగా మారక మునుపే తుంచేస్తే మంచిదని చూసిన వారు అభిప్రాయపడుతున్నారు. ఆ మొక్క కాస్త పెరిగి పెద్దదైతే భవనానికే ప్రమాదమని, స్కూల్ హెచ్ఎం, ఉపాధ్యాయులు స్పందించి వెంటనే తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న వైసిపి నాయకులు

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని నారనాగేపల్లిలో కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న వడ్డి వీర చిన్నక్క ఆదివారం మృతి చెందింది. విషయం తెలిసిన వెంటనే వైసిపి నాయకులు ఆ గ్రామం వెళ్లి ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 6 వేలు అందజేశారు. కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు నాగరాజు, రాధాకృష్ణ, నాయకులు మహేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాధప్ప, జయచంద్ర, రామంజి, రాము, సుబ్రమణ్యంరెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రేపు ఉచిత గుండె వైద్యశిబిరం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణంలోని 25వ వార్డులో ఈ నెల 19వ తేదీ ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వార్డు టిడిపి ఇన్‌ఛార్జి భీమినేని ప్రసాద్‌నాయుడు తెలిపారు. తన తల్లి భీమినేని నారమ్మ జ్ఞాపకార్థం స్థానిక ఎర్రగుంట చెన్నకేశవపురంలోని శిశు సంక్షేమ కార్యాలయం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని, ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భీమినేని ప్రసాద్‌నాయుడు

ఉల్లాసంగా కార్తీక వనభోజనాలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని సంజీవపురం గ్రామం వద్ద వెలసిన కాటి కోటేశ్వర క్షేత్రం సమీపంలో ఉన్న అనంతలక్ష్మి విద్యాసంస్థల యజమాని ముళ్లగూరు అనంతలక్ష్మి రాముడు వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం కార్తీకమాస వనభోజనాలను ఉల్లాసంగా ఉత్సాహంగా నిర్వహించారు. అనంతలక్ష్మి విద్యాసంస్థల ఛైర్మన్ ఎం.అనంత రాముడు, వైస్ ఛైర్మన్ రమేష్‌నాయుడు దంపతుల ఆధ్వర్యంలో అనంతలక్ష్మి వ్యవసాయ క్షేత్రంలో కార్తీకమాస వనభోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో అనంతపురం నగరానికి చెందిన సుమారు 150 కుటుంబాలకు చెందినవారు, సంజీవపురం, బత్తలపల్లి, గ్రామాలకు చెందిన సమీప బంధువులు వందల సంఖ్యలో హాజరయ్యారు. 60 ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో సాగు చేస్తున్న ఉసిరి చెట్ల కింద మహిళలు నెయ్యి దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంకాలం వరకూ కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేశారు. మధ్యాహ్నం సామూహిక సహపంక్తి భోజనం చేశారు. నిర్వాహకులు అనంతలక్ష్మి రాముడు మాట్లాడుతూ కార్తీక మాసంలో ఏటా తమ వ్యవసాయ క్షేత్రంలో కార్తీక మాస వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల స్కిల్ డెవలప్మెంట్ డైరెక్టర్ ముళ్లగూరు సురేంద్రనాయుడు, డయాబెటిస్ ప్రముఖ వైద్యులు డాక్టర్ సతీష్, టిడిపి నాయకులు ముళ్లగూరు వెంకటేష్, అయ్యప్పనాయుడు, నెట్టెం కృష్ణమనాయుడు, ముళ్లగూరు చిరంజీవి, ముళ్లగూరు రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉసిరిచెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని గంగంపల్లి గ్రామంలో ఆదివారం టిడిపి నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి సభ్యత్వం తీసుకుంటే కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి సభ్యత్వం నమోదు చేయించారు. కార్యక్రమంలో తెలుగు రైతు కార్యదర్శి గంగంపల్లి నరసింహులుయాదవ్, చెన్నుపాటి సూర్యనారాయణ, మాజీ ఎంపిటిసి గంగాద్రి, శ్రీధర్‌చౌదరి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. స్థానిక మరువ ఆంజనేయస్వామి ఆలయ సమీపంలోని కాలనీలో చేపట్టిన సభ్యత్వనమోదు కార్యక్రమంలో నాయకులతో కలిసి పల్లె పాల్గొన్నారు. పల్లె మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సభ్యత్వ నమోదు చేయిస్తున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, నాయకులు సైకిల్ షాపు బాబా, నల్లమాడ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

గంగంపల్లిలో టిడిపి సభ్యత్వం చేస్తున్న టిడిపి నాయకులు

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పట్టణంలోని శ్రీకన్యకా పరమేశ్వరి ధ్యాన మందిరంలో ఆదివారం రోటరీ క్లబ్ కదిరి వారి సౌజన్యంతో బెంగళూరులోని సాగర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో గ్యాస్ట్రిక్, న్యూరాలజీ, ఆర్థోపెడిక్ సంబంధిత సమస్యలకు వైద్యులు నరేష్, జిఎం.సుముఖ, ప్రమోద్, కె.మునీంద్ర సుమారు 180 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. సమస్య ఉన్న వారిని సాగర్ హాస్పిటల్‌కు సిఫారసు చేశారు. రోటరీ క్లబ్ కదిరి ప్రెసిడెంట్ నితిన్, సెక్రటరీ నాగార్జున మాట్లాడుతూ ముందస్తు వైద్య సూచనలతో జబ్బుల తీవ్రతను తగ్గించి నయం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. శిబిరంలో డాక్టర్ బాబా ఫకృద్దీన్, డాక్టర్ మదన్, క్లబ్ సభ్యులు రాఘవేంద్ర, కిషోర్‌రెడ్డి, తాహేర్‌వలి, రంజిత్, పృథ్వీరాజ్, గణేష్ పాల్గొన్నారు.

సాగర్ ఆసుపత్రి వైద్యులను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఐచర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-బత్తలపల్లి

అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై బత్తలపల్లి బైపాస్ వద్ద ఆదివారం ఐచర్ వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొంది. వివరాలు.. అనంతపురం నుంచి పుంగనూరు వెళ్తున్న ఐచర్ వాహనం వేగంగా వెళ్తుండగా బైపాస్ వద్ద మైనింగ్ శాఖ ఏర్పాటు చేసిన సిబ్బంది ఆపారు. ఇదే సమయంలో కదిరి నుంచి అనంతపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు బైపాస్‌లో రోడ్డు క్రాస్ చేస్తూ అదుపు తప్పి ఆగి ఉన్న ఐచర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ కెఎస్.రెడ్డి గాయపడగా స్థానికులు వెంటనే ఆర్టీటీ ఆసుపత్రికి తరలించారు. బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. అనంతరం ఇరువర్గాల వారు రాజీ అయి కేసు లేకుండా ఎవరిదారిన వారు పోయినట్లు తెలిసింది. అయితే కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఐచర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కదిరి అర్బన్

భగవాన్ శ్రీసత్యసాయిబాబా జయంతి సందర్భంగా శ్రీసత్యసాయి జీవితంపై జిల్లా సేవా సమితి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అందులో నల్లచెరువు కెజిబివి విద్యార్థిని వి.స్నేహలత ద్వితీయ స్థానం సాధించింది. వి.స్నేహలత జిల్లాస్థాయి హైస్కూల్ పోటీల్లో కూడా తెలుగు మీడియంలో మొదటి బహుమతి పొందిందన్నారు. ఇంగ్లీష్ మీడియంలో బాలికల జూనియర్ కళాశాలకు చెందిన రెడ్డి శ్రీలక్ష్మి మొదటి బహుమతి, కాలేజీ లెవెల్‌లో తెలుగు మీడియంలో జిల్లా స్థాయి లో నల్లచెరువు కెజిబివికి చెందిన డి.చందు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. వారిని రాష్ట్ర సేవాదళ్ కోఆర్డినేటర్ విశ్వనాథ్‌రెడ్డి, కదిరి సత్యసాయి సేవా సమితి సమితి కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి, విద్యా కో ఆర్డినే టర్ రవినాయక్, సేవాదళ్ కోఆర్డినేటర్ గోపాల్, వెంకటరమణప్ప, సమితి సభ్యులు అభినందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ఆశా వర్కర్ల సమస్యలపై నేడు కలెక్టరేట్ ముందు ధర్నా : సిఐటియు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఆశా వర్కర్ల సమస్యలపై రాష్ట్ర కమిటీ(సిఐటియు) పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద చేపడుతున్న ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం, సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. పట్టణం లోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం నాయకులు జెవి.రమణ, ఎస్‌హెచ్ బాషా, ఇర్ఫాన్, టి.అయూబ్‌ఖాన్, నారాయణమ్మ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రిజిస్టర్లు ప్రభుత్వమే ఇవ్వాలని, సంబంధం లేని పనులు చేయించరాదని, నియామకంలో రాజకీయ జోక్యం తగదని, సెలవులు, ఉద్యోగోన్నతులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, కనీస వేతనం, ఖాళీ పోస్టుల భర్తీ, ఎఎన్ఎం పోస్టుల భర్తీలో వెయిటేజ్, గ్రూప్ ఇన్సూరెన్స్ జీవో, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవ్ జీవో ఇవ్వాలని, విహెచ్ఎస్ఎన్‌సి కమిటీల ద్వారా తొలగించరాదని, తదితర ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ధర్నాలో ప్రతి ఆశా వర్కర్ పాల్గొనాలని కోరారు. సమావేశంలో టి.అయూబ్‌ఖాన్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

నేడు కనకదాస జయంతి : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

అనంతపురం నగరంలోని కెటిఆర్ ఫంక్షన్ హాలులో ఈ నెల 18వ తేదీ భక్త కనకదాస జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని, కురుబ సామాజిక వర్గం ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత పిలుపునిచ్చారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భక్త కనకదాస జయంతి కార్యక్రమానికి కురుబ సామాజిక వర్గం ప్రజాప్రతినిధులు, హిందూపురం ఎంపి పార్థసారధి, కర్నూలు ఎంపి నాగరాజు, కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, ఎమ్మెల్యేలు, ఎంపిలు, అధికారులు, కలెక్టర్, బిసి సంక్షేమశాఖ అధికారులు హాజరవుతారని తెలిపారు.

క్షుద్రపూజలు చేసిన వైసిపి నేతపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్

క్షుద్ర పూజలు చేసి అడ్డంగా దొరికిపోయిన వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు కోరారు. పట్టణంలోని రోడ్లు భవనాల అతిథి గృహంలో ఆదివారం వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. అడ్డదారిలో అక్రమంగా సంపాదించడం కోసం వజ్ర భాస్కర్‌రెడ్డి అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని ఓ గ్రామంలో క్షుద్ర పూజలు చేస్తూ పోలీసులకు అడ్డంగా దొరికిపోయి టిడిపి నాయకులపై అసత్య ఆరోపణలు చేయడం తగదని హితవు పలికారు. అడ్డదారుల్లో సంపాదించడం వైసిపి నాయకులకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. చేసిన తప్పును ఒప్పుకోకుండా టిడిపి నాయకులపై బురద చల్లడం ఏంటని ప్రశ్నించారు. అర్ధరాత్రి సమయంలో వైసిపి నాయకులు క్షుద్ర పూజలు చేయడాన్ని వారు తప్పుపట్టారు. పోలీస్ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి వైసిపి నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, రాజశేఖర్‌బాబు, శేషు, తదితరులు పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

కార్యకర్తల కుటుంబాలకు 'పల్లె' పరామర్శ

ప్రజాశక్తి-కొత్తచెరువు

కొత్తచెరువుకు చెందిన టిడిపి పుట్టపర్తి నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు గాజుల చంద్రమోహన్ ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలిసి ఆదివారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆయన ఇంటికెళ్లి పరామర్శించారు. పల్లె వెంట టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, నాయకులు రెడ్డి శ్రీరాములు, సైకిల్ షాపు బాబా, జనసేన నాయకుడు గాజుల నాగేంద్ర, తదితరులు ఉన్నారు.

కొత్తచెరువు రూరల్ : కొత్తచెరువుకు చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి రవిశంకర్ ఆదివారం మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి వారింటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే విష్ణు మరణ వార్త విని వారి ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కార్యకర్త కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పల్లె

బుక్కపట్నం : బుక్కపట్నంకు చెందిన టిడిపి కార్యకర్త తలమర్ల శేఖర్ తల్లి మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి వారింటికి వెళ్లి ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం చేశారు. కార్యకర్తల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తానని, ఆపద సమయంలో అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

పాత్రికేయులపై దురుసుగా ప్రవర్తించిన బిసి హాస్టల్ వార్డెన్ లక్ష్మీనారాయణను సస్పెండ్ చేయా లని పుట్టపర్తి నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఓడిచెరువులో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వార్డెన్ లక్ష్మీనారాయణ ఎక్కడ విధులు నిర్వహించినా విద్యార్థుల పొట్టగొట్టడం, అవినీతి అక్రమాలకు పాల్పడడం తప్ప విద్యార్థుల అభివృద్ధికి ఏమాత్రం పని చేయడం లేదని ఆరోపించారు. రెండు నెలల క్రితం మండలంలోని గౌనిపల్లిలో ఇన్‌ఛార్జిగా విధులు నిర్వహిస్తున్న సమయంలో సరిగా భోజనం పెట్టడంలేదని విద్యార్థులు ప్లేట్లు పట్టుకుని రోడ్డెక్కారని గుర్తుచేశారు. ఆ విషయాన్ని అప్పుడే రాష్ట్ర మంత్రి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా అతడిని బదిలీ చేశారే కానీ శాఖా పరమైన చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. అతడు హాస్టల్ విద్యార్థులపై అనేక రకాలుగా దౌర్జన్యం చేశారని, కావున ఉన్నతాధికారులు అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయడంతో పాటు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అతడు అక్రమ పద్ధతిలో వార్డెన్ పోస్ట్ సంపాదించారని, ఆ విషయంపై కూడా సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు పూల శ్రీనివాసులు, సిపిఐ మండల కార్యదర్శి చలపతి, సహాయ కార్యదర్శి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

రామ్మూర్తినాయుడు మృతికి టిడిపి నాయకుల నివాళి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని గాంధీనగర్ సర్కిల్‌లో ఉన్న టిడిపి కార్యాలయంలో ఆదివారం నారా రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు పరిసే సుధాకర్, కమతం కాటమయ్య, నాయకులు మాధవరెడ్డి, నాగూర్‌హుస్సేన్, షరీఫ్, ప్రసాద్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయునికి యుటిఎఫ్ నివాళి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఇటీవల పెనుకొండ సమీపంలోని గుట్టూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన పిఇటి గిరక రమేష్‌తో పాటు అతడి కూతురు సాయిభవిత మృతి చెందారు. దీంతో ఆదివారం పట్టణం లోని కాలేజీ గ్రౌండ్‌లో బాస్కెట్‌బాల్ కోర్టు ఆవరణలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. ఈ సభకు 1992-93 విద్యా సంవత్సరంలో రమేష్‌తో కలిసి పదో తరగతి చదివిన మిత్ర బృందం, సహచర వ్యాయామ ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, క్రికెట్ క్రీడాకారులు హాజరై రమేష్, భవిత చిత్రపటాలకు పులమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భవిష్యత్తులో రమేష్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, వెంకటకిషోర్, శ్రీనివాసులు, నారాయణ స్వామి, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లా, హాకీ కోచ్ అనిల్, పిఇటిలు ఓబులేసు, ఆకులేటి రమేష్, రఘునాథ్‌రావు, నాగేంద్ర, శివకృష్ణ, గోవిందు, రమేష్, మిత్ర బృందం రాయపాటి రామకృష్ణ, జయం రాఘవ, కేశగాల్ల రంజిత్ కుమార్, సాకే రవికుమార్, అన్నం మల్లికార్జున, జింకా గిరి, రామ్మోహన్‌నాయుడు, గోల్డ్ హిద్దు, బొగ్గు వెంకటేష్, బిల్లే ప్రసాద్, మైఖేల్, దామోదర్, బాబా, మల్లికార్జున, కపాడం శ్రీనివాసులు, గుర్రం రామాంజనేయులు, రమణారెడ్డి, రామచంద్ర పాల్గొన్నారు.

పిఇటి రమేష్, భవిత చిత్రపటాల వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పాత్రికేయునిపై కేసు ఉపసంహరణ

ప్రజాశక్తి-కదిరి టౌన్, నల్లచెరువు

ఇటీవల పాత్రికేయునిపై కేసు బనాయించిన బిసి హాస్టల్ వార్డెన్ లక్ష్మినారాయణ ఆదివారం పోలీసులు, పాత్రికేయుల సమక్షంలో ఉపసంహరించుకున్నారు. ఎపియుడబ్ల్యుజె డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా నాయకులు ఫారూక్ ఆధ్వర్యంలో పాత్రికేయుల పట్ల ప్రవర్తించిన తీరుకు బహిరంగ క్షమాపణ చెబుతూ కేసు ఉపసంహరణకు సంబంధించి లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారు. సమాజంలో పాత్రికేయులు పాత్ర కీలకమని, భవిష్యత్తులో వారి పట్ల స్నేహ పూర్వకంగా ఉంటూ ఎలాంటి పొరపాట్లు చేయబోనని తెలిపారు. కార్యక్రమంలో శివ, శ్రీనివాసులు, ఆంజనేయులు, విజయ్ కుమార్‌రెడ్డి, సతీష్, లక్ష్మీపతి, రఘునాథ్, పాల్గొన్నారు.

పాత్రికేయునిపై కేసు ఉపసంహరించుకున్న హాస్టల్ వార్డెన్

కదిరి పురపాలక సంఘము

"ఇ" ప్రొక్యూర్‌మెంట్

Tender Notice No.1337 to 1338/GNRL/E1/2024, Dated:18.11.2024

క్రింద తెలిపిన పనులకు అర్హులైన వారి నుండి టెండర్లు పిలువడమైనది.

పనిపేరు	పనుల సంఖ్య	అంచనా మొత్తం
General Funds	02 నెం.	రూ.9.85 లక్షలు

ఆన్‌లైన్‌లో షెడ్యూలు డౌన్ లోడింగ్ ప్రారంభ తేది : 18-11-2024 ఉ॥11.00 గం॥లకు
ఆన్‌లైన్‌లో షెడ్యూలు డౌన్ లోడింగ్ చివరి తేది : 21-11-2024 సా॥05.00 గం॥లకు
బిడ్ చివరి తేది : 21-11-2024 సా॥05.30 గం॥లకు

తదుపరి వివరములకు https://tender.apeprocurement.gov.in "ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్లేస్‌లో పొందవచ్చును.

ఆఫీసు చిరునామా : కమీషనర్, కదిరి పురపాలక సంఘం, ఫోన్ నెం.08494 224091

Note: Any addendum/Corrigendum/Bid Clarifications /Time extension shall be issued on the website only. No separate press notification hall be issued.

సం/- కమీషనర్, కదిరి పురపాలక సంఘము